క్లుప్తంగా

సాగులో ఉన్నాం.. పట్టాలివ్వండి



కుందుర్పి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దళిత రైతులు

కుందుర్పి: కుందుర్పి రెవెన్యూ గ్రామ పరిధిలోని 76 ఎకరాల గోలవంక భూమిలో సాగులో ఉన్న దళితులకు పట్టాలు, పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్ ఓబులేసును సోమవారం కోరారు. ఎస్సీ కాలనీకి చెందిన 4 మేట్ల దళితులు సర్వే నంబర్లు 466,467,467-1, 463,164, 163, 100-1,118 సర్వే నంబర్లలో 76.16 ఎకరాలు ఏళ్ల తరబడి సాగులో ఉన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఫెర్రర్ ఆలయ కమిటీ చైర్మన్ వైబీ, ఓబయ్య, హనుమంతరాయుడు, వన్నూరప్ప, హనుమంతప్ప, హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి

కూడేరు: భూ,ప్రజా సమస్యలు పరిష్కరించాలని కరుట్లపల్లి, కమ్మూరు, కూడేరుతో పాటు మరికొన్ని గ్రామాల రైతులు, ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వినతులు అందించారు. డీటీ ఉదయ్ భాస్కర్ అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఏఓ శుభకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సురేఖ, హార్టికల్చర్ ఎంపీఈఓ జాస్మిన్, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ అశోక్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ పఠనం



ఉరవకొండ ఆసార్ మకాన్ వద్ద మిలాద్ పఠనం

ఉరవకొండ: స్థానిక జామీయ మసీదు ఎదురుగా ఆసార్ మకాన్ వద్ద మహ్మద్ ప్రవక్త 1500వ జన్మదినం సందర్భంగా మిలాద్ పఠనం కొనసాగుతోంది. సోమవారం సయ్యద్ అజ్మతుల్లా హుసేనీ, సయ్యద్ తఖీబాబా, సయ్యద్ తాసీర్‌బాబాల ఆధ్వర్యంలో మిలాద్ పఠనం సాగింది. మహ్మద్ ప్రవక్త సూక్తులతో పాటు నాత్‌ఖ్వానీల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈనెల 5న మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ జెండా ఊరేగింపు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జామియా తాసీరియా ఎడ్యుకేషనల్ చారిటబుల్ సొసైటీ సభ్యులు, పట్టణ ముస్లింలు పాల్గొన్నారు.

పశువులు, కుక్కల దాడిని అరికట్టండి



తహసీల్దార్, ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీ వన్నూరుసాబ్

ఉరవకొండ రూరల్: పట్టణంలో పశువులు, కుక్కలు, కోతుల దాడిని అరికట్టాలని ఎంపీటీసీ వన్నూర్‌సాబ్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ మహబూబ్ బాషాకు సోమవారం వినతిపత్రం అందించారు. మేజర్ పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆయన అధికారులకు తెలియజేశారు. చిన్నపిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారని, పెద్దలు సైతం వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లలేకపోతున్నారని వినతిపత్రంలో తెలిపారు.

విద్యుత్ మీటర్ రీడర్ల నిరసన

రాయదుర్గంటౌన్: సమస్యలు పరిష్కరించాలని మీటర్ రీడర్లు పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. రాయదుర్గం అర్బన్, రూరల్, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట మండలాల్లో మీటర్ రీడర్లు హాజరయ్యారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. దాదాపు 27 మంది మీటర్ రీడర్లు రీడింగ్ తీయడాన్ని నిలిపివేసి నిరసనలో పాల్గొన్నారు. ఏపీ మీటర్ రీడర్ల అసోసియేషన్ అధ్యక్షుడు గోపి, దాదు మాట్లాడారు. మీటర్ రీడర్లు బాలాజీ, వన్నూరుస్వామి, నిఖిల్, హనుమంతరెడ్డి, రఘు, తిరుమలేశు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లిలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం గ్రామంలో వరుణ్ అనే యువకుడు జ్వరంతో మృతి చెందాడు.దీంతో స్థానిక వైద్యాధికారిణి రఫియా సుల్తాన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి జ్వరాలపై సర్వే చేశారు. వరుణ్ మృతిపై ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ దాస్ విచారణ చేశారు. జ్వరంతో పాటు కామెర్లు కావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. గ్రామంలో పారిశుద్య పనులు, ఫాగింగ్ చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

'దుర్గం' కన్నీళ్లు తుడిచిన రాజన్న

- 'దుర్గం' సాగు, తాగునీటి అవసరాలు తీర్చారు
- ఇందిరమ్మ పథకానికి ఇక్కడే అంకురార్పణ
- నేడు మహనీయుడి వర్ధంతి



రాయదుర్గం: అందరి బాగోగులు చూసిన.. అందరూ మెచ్చిన, నచ్చిన నేత వైఎస్సార్.. పేదలకు పథకాలు అందించి సంక్షేమ ప్రదాత అయ్యారు..సాగు,తాగునీటి అవసరాలు తీర్చి, అపర భగీరథుడయ్యారు.. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రాణదాత అయ్యారు.. సరిహద్దు ప్రాంతాలను కూడా సస్యశ్యామలం చేశారు.. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు.. కార్యకర్త నుంచి నాయకుడి వరకు ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పిలిచి.. అందరి వాడు అయ్యారు.. అందుకే ఆయన మన నుంచి దూరమై ఏళ్లు గడిచినా అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. మహానేత వర్ధంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించనున్నారు.

'దుర్గం' దాహం తీర్చిన ఘనత వైఎస్సార్‌దే..

దివంగత నేత వైఎస్సార్ చలువతోనే పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందుతున్నాయి. 2004కు ముందు పట్టణంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండేది. దీనికితోడు ఈ ప్రాంతానికి బంధువులు వచ్చేవారు కాదు.. పెళ్లీడుకొచ్చిన యువకులకు పిల్లలను ఇచ్చేవారు కాదు.. ఎవరి నోట విన్నా నీటి కష్టాలపై మాటలే వచ్చేవి. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో వైఎస్సార్ సీఎం అయిన తర్వాత ప్రత్యేక చొరవ చూపారు. హెచ్చెల్సీ బోర్డులో 0.2 టీఎంసీల నీటి కేటాయింపులు చేశారు. అక్కడితో ఆగకుండా రూ.52 కోట్లు మంజూరు చేసి, వైఎస్సార్ తాగునీటి పథకానికి శంకుస్థాపన చేశారు. నెలల వ్యవధిలోనే పూర్తి చేయించిన ఘటన వైఎస్సార్‌కే దక్కుతుంది. ప్రస్తుతం రాయదుర్గంలో ప్రజల దాహార్తి తీర్చారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

గూడు లేని నిరుపేదలందరికీ పక్కా గృహం కట్టించాలనే లక్ష్యంతో 'ఇందిరమ్మ' పథకానికి నాటి సీఎం వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. లక్షలాది ఇళ్లను కట్టించి, పేదల సొంతింటి కల నెరవేర్చిన మహనీయుడు వైఎస్సార్. ఈ గొప్ప పథకానికి అంకురార్పరణ గుమ్మఘట్ట మండలం గలగలలో జరగడం హర్షించదగిన విషయం. 2006లో ఆ ఒక్క గ్రామంలోనే 860 ఇళ్లు మంజూరు చేసి పూర్తి చేయించారు. దీంతో ఆ గ్రామస్తుల మదిలో వైఎస్సార్ ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయారు.

ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న నేత వైఎస్సార్..

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జలయజ్ఞం పేరిట 86 ప్రాజెక్టులను చేపట్టి, వాటిలో 60 ప్రాజెక్టులకు పైగా పూర్తి చేసి అపర భగీరథుడిగా తెలుగు ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. సోమవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా మహనీయుడి సేవలను గుర్తు చేసుకున్నారు. అనంత లాంటి కరువు జిల్లాకు జీడిపల్లి రిజర్వాయర్‌ను జీవనాడిగా నిలిపారన్నారు. అక్కడి నుంచి బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తీసుకొచ్చి, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలని తలిచారని కొనియాడారు. ఆయన అకాల మరణం తర్వాత ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ బాధ్యతల్ని భుజాన వేసుకున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొన్ని పనులు నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పూర్తిగా బ్రేకులు పడ్డాయన్నారు. రైతు సంక్షేమానికి వైఎస్ కుటుంబం పెద్దపీటవేస్తూ వచ్చిందని గుర్తు చేశారు.



గలగలలో సీఎం హోదాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పైలాన్ ఆవిష్కరించిన వైఎస్ఆర్(ఫైల్)



కణేకల్లు వద్ద వైఎస్సార్ హయాంలో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు

కార్యక్రమానికి తరలిరండి



మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

మహానేత వైఎస్సార్ 16వ వర్ధంతి వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్నాయని మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. కార్యక్రమం విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం పక్కనున్న విగ్రహానికి 10:30 గంటలకు పూలమాలు వేసి, నివాళులర్పిస్తామన్నారు. అనంతరం రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేస్తామన్నారు. వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకంతో పాటు పూలమాలలు వేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలన్నారు.

ప్రసాదం అందజేత



మాజీ ఎమ్మెల్యే విశ్వ, యువనేత ప్రణయ్‌కు ప్రసాదం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు విజయవంతంగా ముగియడంతో అమ్మవారి ప్రసాదాన్ని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, యువనేత వై.ప్రణయ్‌రెడ్డికి సోమవారం అందించా రు. అనంతపురంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరుబాషా, కో శాధికారి జెండా జిలాన్, శర్మాస్, సర్దాం, యూసుఫ్‌లు వెళ్లారు. దర్గా కమిటీ అధ్యక్షుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే విశ్వ, యువనేత ప్రణయ్‌ను సన్మానించారు.

రేపు జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.నరసింహారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీయువకులు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు హాజరుకావచ్చని, వివరాలకు సెల్: 9182920381లో సంప్రదించాలన్నారు.

సీతాఫలం విక్రయానికి రేపు వేలం

అనంతపురం సెంట్రల్: రాయదుర్గం, కళ్యాణదుర్గం అటవీ రేంజ్ పరిధిలో సీతాఫలం యూనిట్ల అమ్మకానికి బుధవారం వేలం నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి విఘ్నేష్ అప్పావు ఒక ప్రకటనలో తెలిపారు. వేలం రద్దయితే 4, 6 తేదీల్లో తిరిగి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు అనంతపురం శ్రీనగర్‌కాలనీలోని అటవీ శాఖ కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనాలన్నారు.

మారెమ్మ విగ్రహం ఊరేగింపు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: కణేకల్లు క్రాస్‌లో సోమవారం సాయంత్రం మారెమ్మ జాతర జరిగింది. మంగళవారం జరగనున్న జాతరను పురస్కరించుకొని అర్చకులు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మంగళారతి, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని రథంలో ఉంచి ఊరేగించారు. మహిళలు కలశాలు పట్టుకొని ఊరేగింపులో పాల్గొన్నా రు.

ఎస్‌డీఎల్‌సీఓగా బాధ్యతలు



నూతన ఎస్‌డీఎల్‌సీఓను సన్మానిస్తున్న మేనేజర్, సిబ్బంది

రాయదుర్గం: రాయదుర్గం సబ్ డివిజన్ సహకార సంఘం (ఏడీసీసీ) బ్యాంకు ఎస్‌డీఎల్‌సీఓగా మల్లా రాముడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఏడీసీసీబీ మేనేజర్ ఫణిభూషణ్ ఆధ్వర్యం లో సూపర్‌వైజర్ టీ జయరాములు, సొసైటీల సీఈఓలు శ్రీనివాసులు, రమణారెడ్డి, దాదాపీర్, కుమార్ మంగళం, మోహన్, బసవ రాజు, మోహన్‌రెడ్డి, ఆంజనేయులు సన్మానించారు.

జరుట్లరామలింగేశ్వరుడికి అభిషేకాలు



వజ్రకరూరు: మండలంలోని జరుట్ల రాంపురంలో రామలింగేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉద యం ఆలయంలో స్వామికి పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాదాలు పంపిణీ జరిగింది. వజ్రకరూరులోని నగరేశ్వర స్వామి,భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

వారపు సంత వేలం

బ్రహ్మసముద్రం : వేపులపర్తి గ్రామంలో వారపు సంత (కూరగాయల మార్కెట్)కు సంబంధించి వేలం పాట సోమవారం నిర్వహించారు. డీఎల్‌డీఓ నాగేశ్వరరావు , ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రంగనాయకులు కలిసి వారపు సంత వేలం వేశారు. వేలం పాటలో రామకృష్ణ అనే వ్యక్తి రూ.43 వేలకు అత్యధికంగా పాడి హక్కులు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ పీ రంగప్ప, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడంలో బాబు దిట్ట

- వైఎస్సార్ చొరవతో కళ్యాణదుర్గం, రాయదుర్గానికి తాగునీరు
- కుప్పానికి నీళ్లు సరే... కళ్యాణదుర్గం 114 చెరువుల సంగతేంటి..?
- జిల్లా అధ్యక్షుడు అనంత, సమన్వయకర్త రంగయ్య, పార్లమెంట్ అబ్జర్వర్ నరేష్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, చిత్రంలో పార్టీ అబ్జర్వర్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, తిప్పేస్వామి తదితరులు

కళ్యాణదుర్గం: అలవిగాని హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు.. అధికారంలోకొచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా.. సంక్షేమ పథకాల సంగతి పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. సోమవారం కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్దిలో 'బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్లమెంట్ అబ్జర్వర్ నరేష్ కుమార్ రెడ్డి, పీఏసీ సభ్యుడు, మాజీ ఎంపీ, సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమా మహేశ్వర నాయుడు హాజరయ్యారు.

14 నెలల్లో చేసిన అభివృద్ధేమీలేదు..

జిల్లా అధ్యక్షుడు అనంత మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు..ఏడాది పాలనలో ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ప్రజలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట అని అన్నారు. తాను ఎంపీగా, రఘువీరారెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో తాగునీటి సమస్యను దివంగత సీఎం వైఎస్సార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే కళ్యాణదుర్గం, రాయదుర్గం, మడకశిర, హిందూపురం వరకు శ్రీరామరెడ్డి తాగునీరు అందించి ప్రజల దాహార్తిని తీర్చారని కొనియాడారు. కూటమి నేతలు ఎక్కడైనా అభివృద్ధి చేశారా? అని నిలదీశారు. చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పానికి కృష్ణా జలాల్లు తీసుకెళ్తుంటే..జీడిపల్లికి ఆనుకుని ఉన్న కళ్యాణదుర్గానికి ఎందుకు నీరు ఇవ్వలేకపోతున్నారన్నారు. కూటమి ప్రజాప్రతినిధులకు సిగ్గుంటే జీడిపల్లి నుంచి బీటీపికి నీళ్లు తీసుకొచ్చి, నియోజకవర్గంలోని 114 చెరువులు నింపాలని కోరారు. ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కూటమి నేతలు పెడుతున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదని భరోసా ఇచ్చారు.

అధికార బలంతో అడ్డుకుంటున్నారు..

సమన్వయకర్త రంగయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క హామీ నెరవేరలేదన్నారు. కూటమి నేతలు పోలీసు, అధికార బలంతో పాలనపై ప్రశ్నించిన వారిని అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలకు ఎమ్మెల్యే సురేంద్రబాబు సినిమా చూపించారని విమర్శించారు. కుప్పం ప్రాంతానికి మూడు నెలల్లో నీళ్లు ఇచ్చి, ఇక్కడి ఎమ్మెల్యేగా ఉండి కూడా కళ్యాణదుర్గానికి జీడిపల్లి నుంచి బీటీపికి ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. స్టాంపుల కుంభకోణం, మద్యం వ్యాపారాల్లో ప్రభుత్వ ఖజానానికి చేరాల్సిన డబ్బులు పాలకుల జేబుల్లోకి చేరుతున్నాయన్నారు. సురేంద్రబాబు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను తాను స్వయంగా చూ డాలని కోరుకుంటున్నానని తెలిపారు. దేశ వ్యాప్తంగా మద్యం, ఈ స్టాంప్‌ల డబ్బుతోనే ఎన్నికలు బిహార్ ఎన్నికలు జరపొచ్చని విమర్శించారు. కళ్యాణదుర్గంలో కళ్యాణి వైన్స్ పేరిట దోపిడీ సాగుతోందని, రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేయడం దారుణమన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం.. : పార్టీ అబ్జర్వర్ నరేష్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలును విస్మరించి, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. గతంలో పార్టీలకతీతంగా పారదర్శకంగా పథకాలు అందేవని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందించారన్నారు. ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్‌సీపీ నేతలు నిలదీస్తే తప్పా చంద్రబాబు పథకాలు అందించే పరిస్థితి లేదన్నారు. ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ కోసం రంగయ్య చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కదలాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, పార్టీ మున్సిపల్ కన్వీనర్ సుధీర్, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, జి.హనుమంతరాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంఎస్ రాయుడు, అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, తలారి సత్తి, రామాంజనేయులు యాదవ్, మున్సిపల్ కౌన్సిలర్లు తిరుమల వెంకటేశులు, లక్ష్మన్న, హరి, కో ఆప్షన్ అఫ్జల్, ఎంపీపీలు ఆంజినేయులు, భీమేష్, వివిధ విభా గాల అధ్యక్షులు నరసింహులు, రామిరెడ్డి, రాజు, మల్లారి వెంకటేశులు, దాదు, కిరీటి యాదవ్, గోపాల్, సుబ్బరాయుడు, గంగాధర్, మురళి, మల్లి, రామాంజినేయులు, కామక్కపల్లి మల్లికార్జున, నాయకులు కృష్ణారెడ్డి, మంజు, రామాంజినేయులు, రమేష్, సర్పంచులు బాబు, గంగాధర్, ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త తలారి రంగయ్య

'చంద్రబాబు అబద్ధపు హామీలు ప్రజలు నమ్మరు'



బచ్చేహాళ్లిలో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమం

శెట్టూరు: చంద్రబాబు అబద్ధపు హా మీలు ప్రజలు మరో మారు నమ్మరని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. సోమవారం బచ్చేహళ్లి, చింతర్లపల్లి గ్రామాల్లో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. మండల కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ నరసింహు లు, అనుబంధ కమిటీల నాయకులు హరినాథ రెడ్డి, మహాబలి, అనంత రెడ్డి, రాజశేఖర్, శ్యాంసుందర్, నాయకులు బాబురావు, గౌరయ్య, కరిన్న, బాబు, వీరాంజనేయులు, గోవిందు, నరసింహులు, బద్రి, మారెప్ప, శివ, మహాలింగ, తిప్పేస్వామి, శివప్ప, హనుమంతరెడ్డి, తంజిల్ బాషా, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా గ్రామ కమిటీలు : రెండు గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. బచ్చేహళ్లి గ్రామ అధ్యక్షుడిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షుడిగా కే. తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శులుగా ముద్దకృష్ణ, ఉసేనప్ప, కార్యదర్శులు బాపూజీ, అనీల్, మనోజ్, రంగస్వామి, బ్రహ్మయ్య, చింతర్లపల్లి గ్రామ అధ్యక్షుడిగా బోయ రాము, ఉపాధ్యక్షుడిగా మారుతి, ప్రధాన మహాలింగ, కార్యదర్శులు సుమంత్, ధనుంజయ, జయచంద్ర, మల్లయ్య, ఆనంద్, రామూర్తి, నరసింహంప్ప, కిష్టయ్య , బూత్ కన్వీనర్లు గనేష్, నాగేంద్ర, తిప్పేస్వామి, మనోజ్, వెంకటేశులు, శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు కామక్కపల్లి వాసి

కళ్యాణదుర్గం రూరల్: జిల్లా కేంద్రంలోని కృష్ణ కళామందిరంలో ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర స్థాయి నాటక పోటీలకు కామక్కపల్లికి చెందిన రవీంద్ర ఎంపికైనట్లు జిల్లా కళాకారుల సంఘం నాయకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కణేకల్లు: కణేకల్లు క్రాస్-బళ్లారి రోడ్డు మార్గంలో యర్రగుంట శివారులో సోమవారం సాయంకాలం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి గ్రామానికి చెందిన అన్నదమ్ములు యల్లప్ప, రామాంజనేయులు సమీప బంధువుల అంత్యక్రియల కోసం సోమవారం ఉదయం బెలుగుప్ప మండలం శ్రీరంగాపురానికి వెళ్లారు. అక్కడ అంత్యక్రియలు పూర్తయ్యాక ద్విచక్రవాహనంపై బయల్దేరారు. యర్రగుంట శివారులో బొమ్మనహాళ్ నుంచి కణేకల్లు క్రాస్ వైపు వెళ్తున్న ఆరు ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనింది. ఈ ప్రమాదంలో అన్నదమ్ముల కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కణేకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి బళ్లారి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ కార్మికుడికి నివాళి

రాయదుర్గం టౌన్ : గుండెపోటుకు గురై మృతి చెందిన కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుడు శ్రీనివాసులు మృతదేహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప నివాళులర్పించారు. సోమవారం మృతదేహానికి సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు రామాంజనేయులు, నిజాముద్దీన్ ఉన్నారు.





పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు

బ్రహ్మసముద్రం : మండలంలోని పిల్లలపల్లి, బ్రహ్మసముద్రం సచివాలయ పరిధిలో సచివాలయ ఉద్యోగులు, వెలుగు సిబ్బంది పింఛన్ల పంపిణీలో అలసత్వం ప్రదర్శించారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేయాల్సిన సిబ్బంది... ఒకేచోట కూర్చొని పింఛన్ పంపిణీ చేయడంతో దివ్యాంగులు, వృద్ధులు అవస్థలు పడ్డారు.

ఆలస్యంగా పింఛన్ పంపిణీ

కూడేరు: మండలంలో సోమవారం సామాజిక భద్రతా పింఛన్ల నగదు పంపిణీ ఆలస్యమైంది. సర్వర్ సమస్యతో 9 గంటల వరకు పింఛన్ పంపిణీ కోసం సిబ్బంది అవస్థలు పడ్డారు. మండల వ్యాప్తంగా 5,559 మంది లబ్ధిదారులుండగా రూ.2,41,68,500 నగదు మంజూరయ్యిందని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు.

3న ప్యాసింజర్ రైలు రద్దు

కళ్యాణదుర్గం రూరల్: తిరుపతి - కదిరిదేవరపల్లి ప్యాసింజర్ రైలు బళ్లారి రైల్వే స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈనెల 3న ఒక్కరోజు రద్దు చేసినట్లు స్థానిక రైల్వే స్టేషన్ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న తిరుపతి నుంచి బయల్దేరి, గుంతకల్లుకు చేరుతుందని, 3న కదిరిదేవరపల్లి నుంచి గుంతకల్లు మధ్యలో ఒక్కరోజు నిలిచిపోతుందని, ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పంట కోత ప్రయోగాలు చేయాలి

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు చేయాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏఓ పృథ్వీసాగర్, ఏఎస్‌ఓ మమతతో కలసి వీఆర్‌ఓలు, వ్యవసాయశాఖ సిబ్బందితో పంట కోత ప్రయోగాలపై సమావేశం నిర్వహించారు. మండలంలో సాగు చేసిన పంటలకు సంబంధించి ప్రతి ఎకరం కూడా ఈక్రాప్ బుకింగ్‌ను ఈనెల 30లోపు పూర్తి చేయాలన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన మారుతి అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. పట్టణంలోని దేవీరమ్మకాలనీ చెందిన మాలక్క కుమారుడు మారుతి కూలి పనులకు వెళ్లేవాడు. గుండెసంబంధిత సమస్యతో బాధపడుతుండేవాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. సోమవారం గుండెలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకెళ్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. చిన్న వయస్సులో మారుతీ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులు మారుతి మృతదేహాన్ని తన సొంత గ్రామం గోనబావికి తరలించారు.

పూలకుంటలో చోరీ

గుమ్మఘట్ట: పూలకుంట గ్రామానికి చెందిన గంగిరెడ్డి ఇంట్లో దొంగలు పడి అరుతులా బంగారు చైన్, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. వివరాలు.. గంగిరెడ్డి, అతని భార్య ఉషారాణి ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రలో ఉండగా, దొంగలు ఇంటి లోపలికి ప్రవేశించి, బీరువాలోని నగదు తీసుకున్నారు. ఉషారాణి మెడలో ఉన్న నెక్లెస్ బలంగా లాగడంతో ఆమెకు మెలకువ వచ్చి, గట్టిగా కేకలు వేసింది. అప్రమత్తమైన గంగిరెడ్డి.. కొడుకును నిద్రలేపాడు. అంతలోనే దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఈశ్వరయ్య ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.